# ఎంకి బాటిలూ -
# - ఇంకు పాటలూ

ఏమిటి నా ఆలోచనా రాణీ- ఉల్లిపాయలు వలుస్తూ, కంటనీరు కారుస్తూ హాట్ హోమ్‌లో దొంగలా కూర్చున్నావ్ అన్నారు. మావంటింటి మొనగారు(డు కాదు). సరదా కంటె అన్నారుకాని డోంట్ రిపీటిట్- మీరు ఇంట లెక్చువల్ ఐతే కావచ్చు.... ఐడోంట్ కేర్ - నేను వంట లెక్చుయల్ని: నా పనిమనిషి అచ్చమ్మ అంట లెక్చుయల్: దాన్నీ నన్నూ ఏవీ అనడానికి వీల్లేదు. అదిసరేకానీ, ఇంకు బాటిలు పట్టుకొచ్చారా అన్నా. స్టాండపాన్ని బెంచి—మీ పొయెట్సుకి పొటాటో చిప్సు పెడితే తింటారుగాని అస్సల్పని చెప్పకూడదు. కొరివితో హెడ్ గోక్కున్నల్లే—

హావున్నార్! నాకో డవుటుంది.... ఎంకిపాటలు మీ మగాళ్లే ఎందుకు ఎక్కువగాపాడ్డం, లైక్‌చెయ్యడం? అస్తమానూ అష్టపద్స్, తరంగమ్స్, త్యాగరాజ కీర్తన్స్ ఇన్నోటి పాడతారుకాని మా వంట లెక్చుయల్స్ ఈ ఎంకిపాటలెందుకు పాడరు? మంగళహారతులురాసుకుంటారు కాని, మోడ్రన్ పొయిట్రీ ఎందుకు చదవరు?మా ఆడాళ్ళు ఇంటలెక్చుయల్లీ పూర్ క్రీచర్స్.... అంటే చిలుకలు పిచికలు హంసలూ నెమిళ్ళు పావురాలూ.. ఆడాళ్ళు వంట లెక్చుయల్సైతే కాపరాలు తిన్నగాచేయజాలరు. మరేంలేదు- పెంపుడుజంతువులకు తిరగబడే స్వభావంపోతుంది. పతివ్రతలు మంచివంట లెక్చుయల్స్‌కాని ఇంట లెక్చుయల్స్‌కారు.

ఆడవాళ్ళు ఇంట లెక్చ్యుయల్స్ ఐతే పడకటింటి సౌభాగ్యం చెడిపోతుంది. బెడ్ రూం లైట్ వెలగదు. అలాటి హైక్లాస్‌లేడీతో కాపురం పడకగదిలో పెట్రోమాక్సులైటు పెట్టుగున్నట్లుంటుంది. అనుకూలవతియైనభార్య అనగా— బాగా మచ్చికచేసిన మగువ అని అర్థం. మన దేశంలో మొగుడు చచ్చిన ఆడాళ్ళే మతంమీద, దేవుళ్ళమీద, ఆచారాల మీద అథార్టీలు. వీళ్ళ ధాటికి కొత్తకోడళ్ళు కుర్రదంపతులూ తట్టుకోలేక ఓల్డు ఈజ్ గోల్డు అని దాసోహమంటారు. వంశప్రతిష్ఠ, గౌరవం, కులం, డబ్బు, హోదా; అన్నీ వుండాలి. కుర్రాళ్ళకి ఏదిమంచి ఏదిసుఖం అది వీరికక్కర్లేదు. కట్నాలూ లాంఛనాలూ జరపవలసినవన్నీ జరిపితేనే కాని పిల్లదాని కొంగుగాలి తగలనివ్వరు పిల్లాడికి.

తెలుగుయువకుల రసజ్ఞతా. దారిద్ర్యానికి కట్నాలిచ్చుకోలేక ఎదిగి పెళ్ళికాకుండా కూర్చున్న ఆడపిల్లల సహస్రనామాలే సాక్షి. (విత్ అపాలజీస్ టు చాసో). అంతేకాని హోటళ్ళలో, లాడ్జింగు హోముల్లో. గుడిసెల్లో, సందుల్లో. గొందుల్లో, రూపాయలుపోసి విలువకట్టి సంపాదించుకున్న శారీరకసుఖంతో తెలుగువారి రసజ్ఞతను కొలవడం సో వెరీబాడ్. కమింగ్ టు ఎంకిపాటిల్— దీజ్ మోడ్రన్ లేడీస్ సినిమాసాంగ్స్ పాడతారుకాని ఎంకిపాటలు వారు పాడలేరు. (అపస్వీటా — నీ టెల్గూ నీ ఇంగ్లీషుకన్నా ఘోరంగావుంది. నీ లాంగ్వేజీ బెడ్రూమ్స్‌లో ఆంధ్రా సంతా టూచాతప్పకుండా ఫాలోఅవుతున్నారు. పెళ్ళాం మొగుడికి తమలపాకు చిలక అందించినట్లు మాటల్ని విసుర్తున్నారు చిరంజీవి సౌభాగ్యవతులు. తమతమ మొ(న)గాళ్ళమీద— టేక్ కేర్- ఇంప్రూవ్ యువర్ ఇంగ్లీషు— )నేను ఎంకిపాటిల్ ఎందుకు తీసుకురాలేదో చెప్పనా— నువ్వు సిరా మీద ఒలకబోసుకుంటావ్—

చాలించండి. మీ సొంతగొప్పలు-ఎంకిపాటిల్ మీదపోసుకోడానికి మేమెవరమూ ఆపులంకాము.

నా ఆలోచనారాణీ అవులంటున్నావేమిటి? ఒళ్ళు తూల్తోందా — తల తిరుగుతోందా?

నాటిన్ది లీస్టు —

అవులనగా మేధావులు, మైడియ్యర్‌సార్ (నా ప్రియమైన అయ్యా) వింటున్నారా? ఎవరూ షటప్ అనకుండా మీకు నోరుమూసుకు పోయిందేమి?

ఇందాక బిగినింగులో ఇంకు బాటిలు పట్టుగొచ్చావా అంటే ఎంకి పాటలు పటుకొచ్చానంటారేవిటి? ఎవరేనా డాక్టరుగారి దగ్గరకెళ్ళి మందు తీసుకోండి. మందంటే. మెడిసిన్_అదనుకునేరు. అదేవన్నా అయితే శ్లాక్స్ కొనుక్కొచు కోండంటె సాక్స్ కొనుక్కొచ్చుగుంటారు. ఇంకా కొంచెం స్ట్రాంగ్ మెడిసినైతే ఎంకిబాటిలూ ఇంకుపాటలూ అంటారు. బై ది బై!

మీరు కేటగారికల్‌గా ఇంటలెక్చువలైతే _ నేను భానుమతీ అత్తగారి కల్‌గా వంటలెక్చువల్ని. మరియు స్వామీ వినండి. మన అచ్చమ్మ అమ్మగారికల్‌గా అంటలెక్చువల్. అదీసంగతి ఏం మాట్లాడరు? నన్ను ఆలోచనారాణీ దొంగనాయకమ్మ అంటే వూరుకునేదిలేదు. వూరుకోను.

నువ్వు నా ఆలోచనలకు రాణివి కనుక నిన్ను నా ఆలోచనారాణీ అనొచ్చు. నువ్వే నా మనస్సును దొంగిలించినదానివి, నా జీవితకథా నాయికవు గనుక సంసారపక్షంగా దొంగనాయకీ అని ముద్దుగా పిల్చుకుంటే తప్పా?

తప్పా తప్పున్నరా., అరలెందుకే మళ్ళీ అరలూ మరలూను — మనమధ్య అరమరలు లేవుకనుక, నేనేవన్నా నువ్వుపడాలి! ఆఫ్‌కోర్సు నువ్వు పూలరంగడూ, గురుగారూ, వంటింట్లో మొనగాడూ అంటే నేను నోరు మూసుగుకూర్చోటంలా. మనం పది అంటాం పది తింటాం — కదే అగ్గిపిల్లా....

అల్లా నాన్సెన్స్ మాట్లాడకండి. మీరు అగ్గిపిల్లా అంటే నేను కుక్కపుల్లా అని అనాల్సొస్తుంది. కవితలో అర్థమైన శృంగారం జీవిత కావ్యంలో కాదు వనితకనర్థం. అబ్బ ఈవాళ పొయిట్రీ తాగొచ్చినట్లు మాట్లాడుతున్నాను. మనస్సును ఎంకిబాటిల్‌లో ముంచి ఇంకుపాటలు రాస్తున్నాను. శ్రీ శ్రీ, చెహోవ్, గోర్కీ, మపాసా, విస్సనాశాస్త్రీ ఎవరైతేనేం— మసాళాపెట్టి కూరొండి తెలుగూ పాఠక్స్‌కి హాట్ హాట్‌గా స్వీట్ స్వీట్‌గా వడ్డించేస్తా. ఘాటుకి తలతిప్పుతోందంటారా...ఐవిల్ సెట్ రైట్. మీరు ఓల్డు పొయిట్రీ తాగొస్తే నేను మోడ్రన్ ప్రోజ్ పుచ్చుగునొచ్చాను జగన్మోహిని అపరావతారంలా. నా ప్రోజు జగన్మోహిని కాదు, నావి ఫస్టుక్లాసుకోతలంటారా? అనండి! అనండి! అమృతకలశం అంటే చెల్సా మీకు.(ఎంకిబాటిల్ అన్నమాట) అన్నమాటకాదు. వున్నమాటే. రేపు నాప్రోజుని సిల్వర్‌స్క్రీనెక్కిస్తే అందులోంచి మతాబాలు, కాకరపువ్వొత్తులు, చిచ్చుబుడ్లు, జువ్వలు, పెటేపకాయలు, సిసింద్రీలు — వ్హాట్ నాట్.. మాటలు సెల్యూలాయిడ్ బాటలగుండా పరిగెడతాయి. నాది జెట్ ప్రోజు. నా ఐడియాలు గరంగరం ఒడియాలు — నా మనస్సు రాకెట్లా చంద్రమండలానికి పరిగెడ్తుంది. భూమి చుట్టూ తిరిగినంత మాత్రాన తృప్తి లేదుదానికి. నా హృదయం బ్రాకెట్లో రాకెట్లాటి కొశ్చన్లున్నాయి. బూజుపట్టిన ఊరగాయల్ని, పురుగులు పట్టిన ప్రాత చింతపండునీ, కుళ్ళుబుట్టల్ని, చింకిచేటల్ని, చిల్లుగంపల్ని, మ్యునిసిపాలిటీ వారిచెత్తకుండీలోకి గిరవాటేసినట్లు, దొంగమతాల్నీ దొంగదేవుళ్ళనీ పునర్జన్మల్నీ జాతుల్నీ కులాల్నీ డబ్బునీ అహంకారాన్నీ అధికారాన్నీ అధికారమదాన్నీ చెత్తకుండీలో నెట్టెయ్యకపోతే, మైడియ్యర్ సర్స్ అండ్ మేడమ్స్! మనవే చెత్తకుండీల్లో అదే భూకైలాసమనుకుంటూ, మురికి కాలవనుచూసి అదే గంగా భాగీరథీ సమానమనుకొంటూ కాంట్ బట్‌గా జీవించాల్సొస్తుంది. గతమంతా తడిసె నెత్తురున, కాకుంటే కన్నీళులతో. ఐ హేట్ లివింగ్ ఇన్ ది పాస్ట్!

ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్నారుగాని కవి— అలా పొగడ్డం అట్టే మంచిపనికాదు. మన దేవుళ్ళ లాటి దేవుళ్ళు లేరు. మన మతంలాటి మతంలేదు. మనదేశంలాటి దేశంలేదు, అని కవుస్ (ఆవులుకాదు మేధావులూ, కవులూ) అరుస్తోంచె మరి మనదేశం భూతలస్వర్గంగా కాక, భూతాలస్వర్గంగా వుందే మిటి? మట్టిగాకపోతే మనుషులేకదా దేశమంటే— ఈ మనుషులు ఈ భూతాలస్వర్గాన్ని సృష్టిస్తున్నార న్నమాట. మనల్నింత దరిద్రం ఎలా చుట్టుకుంది? మన మనుష్యులిలా మట్టిముద్దల్లా పప్పుదిమ్మక్కల్లా ఎలా తయారయారు?

మనకు పరంమీదవున్న వ్యామోహం(స్వర్గంలోని రంభా ఊర్వశి మేనక ఎట్సెట్రాలను సుఖంగా వూహించుకోడంవలన కలిగే మోహం, ఇహంమీద ఇంట్లోని పెళ్ళాం బిడ్డలమీద యింకా బ్రతికున్న వాళ్ళమీద బ్రతకవలసినవాళ్ళమీద లేకపోవడం గొప్ప ట్రాజిడీ. ట్రాజిడీలు జీళ్ల కావు తినడానికి. కాకపోయినా దోసకాయ తరుగుతుంటే చేదు దోస ముక్కలునస్తే వంటలెక్చుయల్‌గాపారేసినట్టు, ట్రెడిషన్‌మీద మోహాన్ని పారేయడానికి వల్లకాదు. అలా పారెయ్యని దొంగనాయకమ్మలు, గమ భక్తి రుజూచేసుకోడానికి అధ్యాత్మ రామాయణకీర్తనలు పాడి, ఉపవాసా లుండి, మొగుళ్ళను తమ భక్తితో పరమ పవిత్రంగా కాల్చుకు తింటారు. సోషల్ సెక్యూరిటీలేని ఆడాళ్ళకు దైవభక్తి గొప్పవరం. మగాడు కర్మను తిట్టుకోడం మానేసినా, యుగాలు గడిచినా, ఆడాళ్ళు పతిదేవుళ్ళను కౌగలించుకోడం, కృష్ణలీలలన్నీ తమకే జరిగాయనుకున్నట్లు ఆనందిస్తూ మధురభక్తి సంప్రదాయంలో కొట్టుకుపోవడం మానరని, ఛాలెంజిచేసి చెప్తాను. అందుకే వంట లెక్చుయల్స్‌కి ఎంకిపాటిలూ ఇంకుపాటలూ అక్కర్లేదు. దే డోంట్ కేర్.